# అక్కా-చెల్లెలు

## రఘుజోయి జోడే

చాలాకాలం క్రిందట ఒక గ్రామంలో అక్కా-చెల్లెలు ఉండేవారు. అక్క యెంత ధనవంతురాలో చెల్లెలు అంత నిరుపేదరాలు. ఒకనాడు చెల్లెలు దారిద్ర్యబాధ సహించలేక అక్క వద్దకు వెళ్లి కొంత ధనసహాయం కోరింది. అక్క సహాయమేమో చేస్తానన్నదిగానీ, ఒక్క షరతు మాత్రం పెట్టింది. కష్టాల్లో వుంది కనుక అదెంతటిషరతైనా వొప్పుకొంటానంది చెల్లి. అప్పుడు అక్క కొంత పైకమిచ్చి "దీంతో సరి, ఇంకెప్పుడూ మా గడప తొక్కకు, ఇదే షరతు" అంది. చెల్లెలికి యేడ్పు వచ్చింది. ఎలాగో ఆ దుఃఖాన్ని దిగమ్రింగి పౌరుషముతో తనదారి తాను పట్టింది. అలావస్తూ ఒక పెద్దభవనముందర హఠాత్తుగా ఆగిపోయింది. లోపల నుండి నృత్యముతోపాటు తియ్యని సంగీతంకూడా ఆమెకు వినబడినది. లోపలికి పోదామనుకొందికానీ, ధైర్యంచాలక అలాగే నిలబడిపోయింది.

అంతలో ఆ భవనమునుండి ఒక పండుముసలిది బయటికి వచ్చి, ఈ పేదరాలిని చూచి, జాలితో "ఎందుకు సంశయిస్తావు, లోనికిపో. ఈ యింటి యజమానిని యేదైనాఒకఉద్యోగం ఇమ్మని అడుగు. అతడు తప్పకుండా నీకు ఏదైనా ఉద్యోగం ఇస్తాడు. కొన్నిదినాలకు నీపై మంచి అభిప్రాయం కలుగుతుంది. అప్పుడు మేడపై రెండవగదిలో ఉండే యంత్రం కావాలని కోరు. ఆ యంత్రాన్ని ఉపయోగించేవిధానం కానీ, దానివలన లాభంకాని ఆయనకు తెలియదు. కనుక ఆయన నీకు ఆ యంత్రాన్ని యిస్తాడు. అప్పుడు దానిలాభము, దాన్ని ఉపయోగించేవిధానం నీకు నేర్పుతాను" అని చెప్పి వెళ్లిపోయింది.

ఆ అమ్మాయి లోపలికిపోయి ఆ ఇంటియజమానిని ఏదైనా ఉద్యోగం ఇమ్మని ప్రాధేయపడింది. అతడా అమ్మాయిని ఉద్యోగంలోనికి తీసుకొన్నాడు. కొన్నిదినాలైనాక, ఆ అమ్మాయి తన సేవకు ప్రతిఫలంగా మేడలో రెండవగదిలో వుండే యంత్రాన్ని యివ్వమని కోరింది. తనకు పనికిరాని ఆ యంత్రాన్ని సంతోషంగా ఆమెకు ఇచ్చివేశాడు, ఆ ధనికుడు.

ఆ యంత్రాన్ని యింటికి తీసుకొనిపోయి భద్రపరచి, తనకు పూర్వం కనబడ్డ ముసలిదానికోసమై పూరంతా గాలించి, ఆమెజాడ కనుగొని, ఇంటికి పిలుచుకొనివచ్చి ఆ యంత్రాన్ని నడపడమూ, నిలిపివేయడమూకూడా నేర్చుకొన్నది. ఆ యంత్రములోని చిత్రమేమిటి అంటే అది కోరిందల్లా యిస్తుందన్నమాట. దాంతో ఆ పేదరాలి దారిద్ర్యమంతా తీరింది.

ఈ యంత్రం సంగతి ఏలాగో అక్కచెవిన పడింది. ఆమె ఏలాగైనా ఆ యంత్రాన్ని తనదిగా చేసికోవాలని చెల్లెలిదగ్గరకువచ్చి



అధికధనాశచూపి ఆ యంత్రాన్ని యివ్వమని పట్టుపట్టింది. అక్క కోర్కను కాదనలేక చెల్లెలు యంత్రాన్ని ఆమెకుయిచ్చి దానిని ఉపయోగించే విధానం తెలిపింది. హద్దుమీరినఆనందంలో దానిని ఉపయోగించేవిధానం అక్క సరిగ్గా వినిపించుకోలేదు.

అక్క తనఇంట్లో ఆయంత్రాన్ని రహస్యంగా దాచి ఆ మరునాడే దాన్ని నడిపి తనకు ధాన్యం కావాలనికోరుకొంది. వెంటనే ఆయంత్రం నుండి ధాన్యం రాసులురాసులుగా రాలింది. ఆమె ఇంట్లోఉండే సంచులు, డబ్బాలు, గదులు అన్నీ ధాన్యంతో నిండిపోయాయి. అంతటితో ఆమె సంతృప్తిపడి, యంత్రాన్ని నిలిపేందుకు ప్రయత్నించింది. కానీ, ఆమె ఆ పుటకు చెల్లెలు చెప్పినవిధానం మరచిపోయింది. ధాన్యపురాసులు అలానే రాలుతూవున్నవి. ఇల్లంతా ధాన్యపుమయమైంది. అక్కడ వుండేందుకు చోటులేక తలుపులు తెరచి తోటలోనికి పారిపోయింది. తోటకూడా ధాన్యముతో నిండిపోతూ వుంది. గత్యంతరంలేక చెల్లెలిదగ్గరకు పరుగెత్తుకొనివచ్చి, ఆ యంత్రాన్ని యేలాగైనా సరే నిలపమని ప్రాధేయపడింది కానీ! అక్కకిచ్చినమాట ప్రకారం ఆమె గడప త్రొక్కకూడదని, చెల్లెలు నిరాకరించింది. దానికి అక్క "ఆయంత్రాన్ని నీవే తీసుకొనిపో, నేను నా సొమ్ముకూడా అడగను," అంది.

తర్వాత యిద్దరు కలసి తోట దగ్గరకు పోయారు. చెల్లెలు ఆ యంత్రాన్ని సులభంగా ఆపివేసి దాన్ని తీసుకొని వెళ్ళిపోయింది.

ఆమెకు సముద్రపుఒడ్డున చక్కని యిల్లు కట్టుకోవలెనని బుద్ధిపుట్టింది. యంత్రసహాయంతో ఒక చక్కని భవనాన్ని సముద్రపుతీరంలో కట్టుకొని సుఖంగా జీవితం గడపుతూ వుండేది.

ఇలా వుండగా ఒకనాడు విదేశీయనావ ఒకటి అక్కడికొచ్చి లంగరు వేసింది. ఆ నావలోనివారికి యీమె ఆతిథ్యమిచ్చి వారిని పంచభక్ష్యపరమాన్నాలతో సంతుష్టులనుగా చేసింది. పైగా, వారికి యంత్రరహస్యాన్ని, దాన్ని ఉపయోగించేవిధాన్ని తెలిపింది. ఆఓడయజమానికి ఏలాగైనా యంత్రాన్ని అపహరించాలని బుద్ధి పుట్టింది. ఆ రాత్రే దాన్ని ఆమెకు తెలియకుండా నావలోని కెక్కించి ప్రయాణం సాగించారు. ఆ ఓడలో పోతూ యంత్రం పూరికే ఎందుకుండాలనిభావించి దాన్ని ఏమడుగుదామా, అని ఆలోచించి కడకు తన దేశంలో కొరతగావుండే "ఉప్పు" కావాలని దాన్ని కోరాడు. ఎందుకంటే అప్పటికి సముద్రపునీరు ఉప్పగాకాక తియ్యగా వుండేది. కొద్దిసేపటికి ఆనావ ఉప్పుతో నిండిపోయినది. ఆ యంత్రాన్ని నిలిపే విధం ఆతడుకూడా సరిగా వినలేదు. కనుక యంత్రాన్ని ఆపేందుకు ఎంత ప్రయత్నించినా అది ఆగలేదు. ఓడ ఉప్పుతో నిండి మునిగిపోయేస్థితికి వచ్చింది. ఓడ యజమానితోపాటు యితరులుకూడా ప్రాణాలను రక్షించుకొనేందుకు వేరేమార్గంలేక సముద్రంలోదుమికి ఏలాగో ఒడ్డు చేరుకొన్నారు.

అంతలో ఆ నావ సముద్రంలో మునిగిపోయింది. కానీ ఆ యంత్రం నీటిలో మునిగినా, ఉప్పుమాత్రం ఇప్పటికీ అలాగే తయారుచేస్తూ వుంది. కనుకనే సముద్రపునీరు నానాటికీ మరింత ఉప్పగా ఉంటోంది. ★

పండిత డి. గోపాలాచార్యులవారి
అరుణా
గర్భాశయ రోగనివారిణి
ఆయుర్వేదాశ్రమం లిమిటెడ్ మద్రాసు-17

